క్లుప్తంగా

పెరటికోళ్ల పెంపకంతో అధిక ఆదాయం



మహిళలకు పెరటికోళ్లు అందజేస్తున్న ఎంపీపీ సులోచన

రాజాం: పెరటికోళ్ల పెంపకం ద్వారా అధిక ఆదాయం వస్తుందని, మహిళలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు ఇదొక చక్కని అవకాశమని ఎంపీపీ లావేటి సులోచన అన్నారు. స్థానిక వైకేపీ కార్యాలయంలో మహిళా సంఘాల్లోని సభ్యులకు పెరటికోళ్లను ఎంపీపీ చేతులమీదుగా శనివారం పంపిణీ చేశారు. మొత్తం 10 కోళ్లను ఒక యూనిట్‌గా తీసుకుని, రూ.4 వేలకు ఒక యూనిట్‌ను అందజేశారు. ఏపీ ఎ.చిరంజీవి మాట్లాడుతూ మండలంలోని 50 సంఘాలకు 50 యూనిట్లు అందజేశామన్నారు. ఒక్కో యూనిట్‌లో ఏడు పెట్టలు, మూడు పుంజులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ ఎల్.రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బి.నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో 'డాక్టర్ వైఎస్సార్ పొలంబడి'



పొలంబడి కార్యక్రమం ద్వారా కలిగే ప్రయోజనాలు వివరిస్తున్న ఏఓ శిరీష

బాడంగి: మండలంలోని భీమవరం గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం శనివారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి కె.శిరీష మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు వచ్చేలా సాగులో సలహాలు, సూచనలు అందజేసే ఈ కార్యక్రమంను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటి నుంచి 14 వారాల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఎప్పుడు ఏ పంట వేయాలి.. ఏ నేలలో ఏ రకమైన పంట వేస్తే ఎటువంటి ఫలితాలు వస్తాయన్న అంశాలను వివరించనున్నామన్నారు. ఎరువులు, పురుగుమందుల వినియోగంతో పాటు సస్యరక్షణ చర్యలపై కూడా అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వాడాడ వీఏఏ సాయికుమార్, భీమవరం వీఏఏ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఓటర్ల సర్వే



ఉనుకూరులో ఓటర్ల సర్వే చేస్తున్న సిబ్బంది

రేగిడి: మండల వ్యాప్తంగా ఓటర్ల సర్వే పక్కాగా నిర్వహిస్తున్నారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి, ఓటర్ల చేర్పులు, తొలగింపులపై వివరాలు సేకరిస్తున్నారు. శనివారం మండలంలోని ఉనుకూరు, పారంపేట, బూరాడ తదితర గ్రామాల్లో జరిగిన సర్వేను తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి పరిశీలించి, పారదర్శకంగా ఓటర్ల జాబితా తయారు చేయాలని సూచించారు.

'ఎస్‌జీటీ'ల రద్దుతో ప్రాథమిక విద్యపై తీవ్రప్రభావం



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ బుఖారిబాబు

రాజాం సిటీ: పాఠశాల విద్యలో సెకెండరీ గ్రేడ్ టీచర్ పోస్టుల రద్దుతో ప్రాథమిక విద్యపై తీవ్ర ప్రభావం పడుతుందని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ బుఖారిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక పట్టణంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఏపీటీఎఫ్ కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీ పోస్టుల రద్దు, ఏకోపాధ్యాయ పాఠశాలల సంఖ్య పెరగడం వల్ల విద్యాబోధన కుంటుపడుతోందన్నారు. తరగతికి ఒక టీచర్ చొప్పున ఉండాలని ఏపీటీఎఫ్ డిమాండ్ చేస్తోందన్నారు. అలాగే ఉపాధ్యాయ, ప్యాఫ్టో, ఏపీటీఎఫ్ పిలుపునిస్తున్న ఉద్యమాల్లో ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఏపీటీఎఫ్ అధ్యక్షుడు ఎం.మదన్ మోహన్, విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు పి.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో ఆరోగ్యవంతమైన పంట

రేగిడి: సేంద్రియ ఎరువుల వినియోగంతో ఆరోగ్యవంతమైన పంట చేతికి వస్తుందని మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని చాటాయివలస గ్రామంలో శనివారం నిర్వహించిన డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సాగులో పాటించాల్సిన మెలకువలు, అధిక దిగుబడులకు సలహాలు, సూచనలు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.గోవిందరావు, ఏఏ కె.శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం



రాజాం: ఇంటింటికీ వెళ్లి, పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు



బొబ్బిలి: మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. శనివారం మండలంలోని గడిముడిదాం గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటింటికీ నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. సచివాలయాల ద్వారా ప్రతీ గ్రామంలో అభివృద్ధి పనులు జోరుగా చేపట్టడంతో పాటు ప్రజాసంక్షేమానికి ఆయన అనేక పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా జన్మభూమి కమిటీలు, మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు గ్రామంలోనే ప్రభుత్వ కార్యాలయాలు ఉండడంతో గ్రామంలోనే చాలా సమస్యలు పరిష్కారమవుతున్నాయని, దరఖాస్తు చేసుకున్న కొన్నిరోజుల్లోనే పథకాలు అందుతున్నాయన్నారు. అన్ని వర్గాల ప్రజలు బాగుండాలన్నదే సీఎం జగనన్న లక్ష్యమని, అందుకే ఆయన అన్ని వర్గాలకు మేలు జరిగేలా పథకాలు రూపొందించి, అమలు చేస్తున్నారన్నారు. జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ ప్యాకేజీకి ఆశపడి, ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన ప్రజానీకమే ఆయనకు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతుందన్నారు. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో చంద్రబాబు కూడా మరోసారి ప్రజలను మాయమాటలతో మోసం చేసేందుకు సిద్ధమవుతున్నారని, ప్రజలు గమనించాలని కోరారు. నిత్యం ప్రజల కోసం పాటుపడే మన సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ లావేటి సులోచన, సర్పంచ్ రమాదేవి, వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, ఎంపీడీఓ బాసూరి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం..

బాడంగి: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పాల్తేరు గ్రామంలో శనివారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని బలంగా నమ్మిన సీఎం జగనన్న మరే రాష్ట్రంలో అమలుకానన్ని పథకాలు ఇక్కడ అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతీ ఇంటికి పథకాల రూపంలో మేలు జరుగుతోందన్నారు. దీంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాధన దిశగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామంలోనే ఎన్నో ప్రజాసమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. మరెన్నో పథకాలు ప్రజలకు పారదర్శకంగా అందుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బొబ్బిలి మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, సొసైటీ అధ్యక్షుడు ఉడమల అప్పలనాయుడు, సర్పంచ్ వివేక, ఎంపీటీసీ వంగపండు దివ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- రైతు భరోసా కేంద్రం భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శంబంగి



రైతు భరోసా కేంద్రం భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలో దాదాపు రూ.25 లక్షల వ్యయంతో కొత్తగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం-1 నూతన భవనాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత నాలుగేళ్లలో దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రంగాల ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. మాసపత్రికలు ఆర్‌బీకేల ద్వారా రైతులకు సాగు సేవలందిస్తున్నారు. గ్రామాల్లోనే సకాలంలో అన్నదాత కోరుకున్న విత్తనాలు, ఎరువులు అందిస్తున్నారన్నారు. నాడు టీడీపీ ఐదేళ్ల పాలనలో కష్టాలు, కన్నీళ్లు చూసిన రైతాంగానికి వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు ఆనందాన్నిస్తున్నాయన్నారు. ఇక్కడి ఆర్‌బీకేల సేవలు నేడు దేశంలోనే ఆదర్శవంతంగా ఉన్నాయన్న ప్రశంసలు అన్నిచోట్ల నుంచి వ్యక్తమవుతున్నాయన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలనకు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకే టీడీపీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ప్రతీ మండలంలోని సచివాలయ భవనాలు, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్లు తదితర కార్యాలయ భవనాలు నిర్మిస్తుంటే అది అభివృద్ధి కాదా, అది టీడీపీ నేతలకు కనిపించడం లేదా ప్రశ్నించారు. ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధితో పాటు నియోజకవర్గంలో మరో రూ.2.40 కోట్లతో అభివృద్ధికి అధికారులు ప్రతిపాదనలు తయారు చేస్తున్నారన్నారు. అభివృద్ధికి రామభద్రపురం మండల కేంద్రానికి రూ.2.50 కోట్ల నిధులు మంజూరయ్యాయని, వాటితో తాగునీటి పనులు చేయిస్తున్నామన్నారు. శ్రీరాంనగర్, కనిమెరక వీధిలో ఓవర్ హెడ్ ట్యాంకులు ఏర్పాటు చేసి, అక్కడి ప్రజల తాగునీటి కష్టాలు తీరేలా చూశామన్నారు. అలాగే కనిమెరక వీధిలోని అంగన్‌వాడీ భవనం ఆధునీకరణకు రూ.4 లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. మంచి చేశారనుకుంటేనే సీఎం జగనన్నను మళ్లీ ఆశీర్వదించి, ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సీహెచ్ లక్ష్మణరావు, జెడ్పీటీసీ ఎ.సరస్వతి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయులు, తహసీల్దార్ రాజారావు, ఎంపీడీఓ రమామణి, పీఆర్ డీఈఈ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బ్రెయిన్ సర్జరీ విజయవంతం



వివరాలు వెల్లడిస్తున్న కేర్ ఆస్పత్రి ఎండీ రాజేంద్ర

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ కేర్ ఆస్పత్రిలో చేపట్టిన బ్రెయిన్ సర్జరీ విజయవంతమైంది. దీనికి సంబంధించిన వివరాలను ఆస్పత్రి ఎండీ డాక్టర్ డి.రాజేంద్ర వెల్లడించారు. రేగిడి మండలంలోని అంబకండి గ్రామానికి చెందిన గెంబలి గణపతిరావు ఈ ఏడాది మార్చి 18వ తేదీన ద్విచక్ర వాహనంపై నుంచి పడిపోవడంతో కాలు విరిగి, తలకు తీవ్రగాయమైంది. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు కేర్‌కు తీసుకురావడంతో అన్నిరకాల పరీక్షలు చేసి, వారి అనుమతితో ఆపరేషన్‌కు సిద్ధం చేశామన్నారు. బాధితుడికి న్యూరోసర్జన్ డాక్టర్ కిశోర్, ఎనస్థీషియా కిరణ్‌లు 25 రోజుల పాటు ఐసీయూలో అబ్జర్వేషన్‌లో ఉంచారన్నారు. ప్రమాదకర పరిస్థితి నుంచి ప్రస్తుతం బాధితుడు బయటపడ్డాడన్నారు. ఇటువంటి క్రిటికల్ పరిస్థితుల్లో జాగ్రత్తలు తీసుకోవడంతోనే ఎటువంటి ప్రమాదం జరగలేదన్నారు. క్రిటికల్ సర్జరీలు ఇంతకుముందు విశాఖపట్నంలో మాత్రమే జరిగేవని, ఈ ప్రాంతవాసులు ఎక్కడకు వెళ్లాల్సిన పనిలేకుండా అందుబాటులో ఉన్నాయన్నారు. బాధితుడికి అంతా ఆరోగ్యశ్రీ ద్వారానే ఉచితంగానే ఇంతవరకు చికిత్స అందించామని పేర్కొన్నారు.

'ఆరోగ్యశ్రీ'తో పునర్జన్మ

నా పేరు గెంబలి సుజాత. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ పథకం నా భర్త గణపతికి పునర్జన్మనిచ్చింది. రోడ్డు ప్రమాదంలో నా భర్తకు కాలు విరగడంతో పాటు తలకు తీవ్రగాయమైంది. బ్రెయిన్ సర్జరీ చేయాల్సి రావడంతో పెద్దమొత్తంలో డబ్బులు కావాల్సి వచ్చింది. చిన్న కిరాణా షాపు ద్వారా జీవనం సాగిస్తున్న తమకు ఇంత పెద్దకష్టం వస్తుందనుకోలేదు. అయితే ప్రమాదం జరిగిన వెంటనే రాజాం కేర్ ఆస్పత్రికి తరలించి, తమ పరిస్థితిని వైద్యులకు వివరించాం. శస్త్రచికిత్సకు రూ.15 లక్షలు అవుతుందని, ఆరోగ్యశ్రీ వర్తిస్తే ఇక్కడే ఉచితంగా ఆపరేషన్ చేస్తామని వైద్యులు సలహా ఇచ్చారు. ఇప్పుడు ఆపరేషన్ విజయవంతమై నా భర్త ఆరోగ్యం బాగుంది. ప్రభుత్వానికి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.



భర్త గణపతితో సుజాత

'జగనన్న సురక్ష'తో పారదర్శక సేవలు



రామభద్రపురంలో రైస్‌కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



రాజాం: సోపేరులో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు



రాజాం సిటీ: రాజాంలోని ఆదర్శనగర్‌లో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



బాడంగి: పిన్నవలసలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ గౌరి



తెర్లాం: ఆమిటిలో అర్జీదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ ఉమాలక్ష్మి, ఎంపీడీఓ రామకృష్ణ



బొబ్బిలి: పారాదిలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ లక్ష్మీవేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ శాంతకుమారి



మెంటాడ: బడేవలసలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు

గ్రామ గ్రామాన ఓ యజ్ఞంలా జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతోంది. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లంతా ఇంటింటికీ వెళ్లి, ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు, పథకాలపై ఆరాతీసి, అవి వారికి పారదర్శకంగా అందేలా చర్యలు చేపడుతున్నారు. దీంతో అర్హులకు గంటల వ్యవధిలో సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. శనివారం పలు గ్రామాల్లో అర్జీదారులకు జనన, మరణ, కుల, ఆదాయం వంటి 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఎటువంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేకుండా అందజేశారు. ఈ కార్యక్రమంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

–బొబ్బిలి, రాజాం సాక్షి నెట్‌వర్క్

ప్రభుత్వ భవన నిర్మాణాలను వేగవంతం చేయండి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు



మాట్లాడుతున్న ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు

బొబ్బిలి: మండలంలోని గ్రామాల్లో చేపడుతున్న ప్రభుత్వ భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు వంటి నిర్మాణాలను త్వరితగతిన చేపట్టాలని సూచించారు. నిర్మాణాలకు కాంట్రాక్టర్లు ముందుకురాని ప్రాంతాల్లో వేరే ప్రాంతాల నుంచి కాంట్రాక్టర్లను తెప్పించి మరీ నిర్మాణాలు చేపట్టాలన్నారు. ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు కూడా ముందుకు రావాలన్నారు. పెంట, పాల్తేరు చానళ్లకు జాయింట్ సర్వే చేసి, ప్రాంతాల వారీగా మరమ్మతులు, సాగునీటి విడుదల చేపట్టాలన్నారు. శాఖల వారీగా ప్రగతి వివరించాలని ఎంపీపీ అధికారులను కోరారు. ఈ సందర్భంగా గిరిజన గ్రామాల్లో కూడా వైద్య శిబిరాలు నిర్వహించి, వైద్యసేవలు అందిస్తున్నామని పిరిడి వైద్యాధికారిణి జ్యోతి సమాధానమిచ్చారు. మండలంలోని లబ్ధిదారులకు జగనన్న అమ్మఒడి నిధులు అందాయని, రూ.16.70 కోట్ల వ్యయంతో నాడు నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలల భవనాలు రూపురేఖలు మార్చుతున్నామని ఎంఈఓ సీహెచ్ లక్ష్మణరావు తెలిపారు. జల జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటి కుళాయిల కోసం రూ.14.92 కోట్లు మంజూరయ్యాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రావణ్ కుమార్ తెలిపారు. ప్రతీ సచివాలయం పరిధిలో సౌచాలయం నిర్మాణానికి సర్పంచ్‌లు ముందుకు రావాలని ఎంపీపీ కోరారు. సమావేశంలో ఎంపీడీఓ పి.రవికుమార్, ఈఓఆర్‌డీ ఎ.భాస్కరరావు, జెడ్పీటీసీ ఎస్. శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

మతోన్మాదాన్ని రెచ్చగొట్టేందుకే యూసీసీ బిల్లు

బొబ్బిలి: దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టేందుకే కేంద్ర ప్రభుత్వం యూసీసీ బిల్లు తీసుకువస్తోందని సీపీఎం నేత పొట్నూరు శంకరరావు విమర్శించారు. శనివారం స్థానిక పట్టణంలోని గంటి ప్రసాదం స్మారక భవనంలో యూసీసీ బిల్లుకు వ్యతిరేకంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ఆయన మనదేశం లౌకిక దేశమని, ఏ మతం వారైనా ఇక్కడ స్వేచ్ఛగా జీవించే హక్కు ఉంటుందని, హిందువులకు తప్ప ఇతర మతస్తులకు మేలు చేయని ఈ బిల్లును అందరూ వ్యతిరేకించాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాలం, సీపీఐ(ఎంఎల్) నేతలు ఎం.గోపాలం, టి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలి

బొబ్బిలి: ప్రాథమిక దశ నుంచే విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో బాగా రాణించేలా చేసి, వారిని శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని, ఆ దిశగా అందరం కృషి చేయాలని డిప్యూటీ డీఈఓ పి.బ్రహ్మాజీరావు ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక పట్టణంలోని ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాలలో ఇన్‌స్పైర్ మనాక్ పేరిట వర్క్‌షాప్ నిర్వహించి, విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను సాఫ్ట్‌వేర్‌లోకి అప్‌లోడ్ చేయడంపై సైన్స్ ఉపాధ్యాయులకు శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పాఠశాల నుంచి విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను జాతీయ విద్యాశాఖ రూపొందించిన సాఫ్ట్‌వేర్‌లోకి అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రాజెక్టుల్లో జాతీయ స్థాయిలో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి, ఆ ప్రాజెక్టులు తయారు చేసిన విద్యార్థులకు రూ.10 వేలు చొప్పున నగదు ప్రోత్సాహకం అందించడం జరుగుతుందన్నారు. ఈ నిధులతో మళ్లీ ఆ ప్రాజెక్టులను తయారు చేసి, త్వరలో జరిగే విజ్ఞాన ప్రదర్శనల్లో ప్రదర్శించాల్సి ఉంటుందన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

రాజాం సిటీ: సమాజంలోని ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన అవసరమని మండల న్యాయసేవాధికార సంఘం అధ్యక్షుడు, సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు తెలిపారు. శనివారం స్థానిక కోర్టు సముదాయంలో ఐసీడీఎస్ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆయన యాసిడ్ బాధితులకు న్యాయ సహాయం, బాధిత పరిహార పథకంపై కాసేపు మాట్లాడారు. నేటి సమాజంలో మహిళలు, మైనర్ బాలికలు, విద్యార్థినులపై అత్యాచారాలు, యాసిడ్ దాడులు అధికమవడం హేయమైన చర్యన్నారు. బాధితులు కూడా క్షణికావేశంలో తప్పుడు నిర్ణయాలు తీసుకోకుండా పరిహారం కోసం న్యాయ సేవా సంస్థలను ఆశ్రయించాలన్నారు. బాధితులు, కుటుంబ సభ్యులు న్యాయస్థానాలను ఆశ్రయించి, న్యాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డి.భవానీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

రేగిడి: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈఓ బి.ఎరకయ్య సూచించారు. శనివారం మండలంలోని దేవుదళ గ్రామంలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాన్ని సందర్శించిన ఆయన అక్కడి విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, వారికి అందిస్తున్న విద్యను పరిశీలించారు. నాణ్యమైన విద్యనందించాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు వండిపెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఓ ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల సంఖ్య పెంచాలి

రాజాం: మండలంలో మహిళా సంఘాల సంఖ్య పెంచాలని డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి రాజాం మండల వైఎస్సార్ క్రాంతి పథం అధికారులు, సిబ్బందికి సూచించారు. శనివారం జూమ్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన గతంలో కన్నా ప్రస్తుతం రాజాం మండలంలో నివాసాలు పెరిగాయని, సంఘాల సంఖ్య కూడా దానికి అనుగుణంగా పెరుగుతుందన్నారు. బకాయి పడిన స్త్రీనిధి రుణాలను లబ్ధిదారులు వెంటనే చెల్లించేలా చూడాలన్నారు. అనంతరం వైఎస్సార్ ఆసరా, చేయూత, జగనన్న తోడు పథకాలు అమలుపై ఆరాతీశారు. కార్యక్రమంలో ఏపీడీ సావిత్రి, రాజాం ఏసీ చిరంజీవి, ఏపీఎంలు దధికుమార్, హేమలత పాల్గొన్నారు.

స్కూల్ నిర్వహణపై డీఈఓకు నివేదిక

బొబ్బిలి: స్థానిక పూల్‌బాగ్ రోడ్డులోని డ్రీమ్ ఇండియా స్కూల్ నిర్వహణపై డీఈఓకు నివేదిక అందజేసినట్లు డిప్యూటీ డీఈఓ పి.బ్రహ్మాజీరావు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ఉన్నత తరగతులకు అనుమతులు లేకపోయినా పదో తరగతి వరకు స్కూల్‌లో తరగతులు నిర్వహిస్తున్నట్లు తనిఖీల్లో తేలిందన్నారు. ఏడో తరగతి వరకు ఆ స్కూల్‌లో తరగతులు నిర్వహించేందుకు అనుమతులు ఉన్నాయన్నారు.

కళ్లకలకలకు ఉచిత మందు

బొబ్బిలి: పట్టణంలోని జగద్గురు పీఠం హోమియో వైద్యశాల వద్ద కళ్లకలకలకు ఉచితంగా హోమియో మందులు ఇస్తున్నట్టు డాక్టర్ శంబంగి సుధాస్రవంతి శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 23వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మందులు పంపిణీ చేస్తామని, కావాల్సిన వారు ఆస్పత్రికి రావొచ్చన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 9347818435, 9491763938ను సంప్రదించాలన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

రామభద్రపురం: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులకు సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. గతంలో టీడీపీ హయాంలో పూర్తి స్థాయిలో ఎప్పుడూ పాఠ్యపుస్తకాలు అందేవి కావని, వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పాఠశాలల పునఃప్రారంభం నాడే పుస్తకాలు అందడం, ఆ తర్వాత సెమిస్టర్ల వారీగా సకాలంలో పుస్తకాలు అందిస్తుండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తెర్లాం: మండలంలోని వెలగవలస గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో సెమిస్టర్ పాఠ్యపుస్తకాల పంపిణీ శనివారం నిర్వహించారు. మండల వైస్ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ చేపేన సత్యనారాయణ చేతులమీదుగా విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పాటు, విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. పేదరిక నిర్మూలన ఒక్క చదువుతోనే సాధ్యమని నమ్మిన ఆయన విద్య కోసం కొన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని, ఆయన ఆశయ సాధనకు ప్రతీ విద్యార్థి కష్టపడి చదవాలని కోరారు. మండలంలోని జగన్నాథవలస పాఠశాలలో ఎంఈఓ త్రినాథరావు సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో డి.గదబవలస ఎంపీటీసీ వెంకట శేషగిరి, రంగప్పవలస సర్పంచ్ శనపతి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వంగర: మండలంలోని 49 పాఠశాలలకు రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాలను సకాలంలో అందించినట్లు ఎంఈఓ వై.దుర్గారావు తెలిపారు. శనివారం స్థానిక ఎంఆర్‌సీలో సీఆర్‌టీలతో సమావేశమైన ఆయన మొత్తం 2,175 పుస్తకాలను అందించినట్లు పేర్కొన్నారు.

బావిలో పడిన ఎద్దు.. సురక్షితంగా ఒడ్డుకు..





బావిలో పడిన ఎద్దు, బావి నుంచి బయటకు తీసిన ఎద్దుకు సపర్యలు చేస్తున్న దృశ్యం

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామంలో జల్ల సూర్యనారాయణకు చెందిన ఎద్దు ప్రమాదవశాత్తు నేలబావిలో పడింది. శనివారం పొలం పనుల అనంతరం మేత మేస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ విషయం గమనించిన రైతు పక్కనే పొలాల్లో ఉన్న ఇతర రైతులకు తెలపడంతో వారంతా హుటాహుటిన నేలబావి వద్దకు చేరుకున్నారు. జేబీసీ సహాయంతో కొంతమేర బావి చుట్టూ తవ్వినప్పటికీ ఎద్దును బయటకు తీసేందుకు వారి ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది దాదాపు రెండు గంటల పాటు శ్రమించి, అందరి సహాయంతో ఎద్దును సురక్షితంగా బయటకు తీశారు. 30 అడుగుల లోతులో పడినప్పటికీ ఎద్దుకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.